క్లుప్తంగా

16న మండల సర్వసభ్య సమావేశం

పూతలపట్టు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 16వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగరాజు తెలిపారు. ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు. మండల స్థాయి అధికారులు, పంచాయతీల సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

సత్యమ్మకు విశేష పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు

తవణంపల్లె: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కె.పట్నంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి అభిషేకం చేయించి పసుపు, కుంకుమ, సుగంధ పరిమళ పుష్పాలతో ప్రత్యేక అలంకరించారు. అమ్మవారికి ధూపదీప నైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా తవణంపల్లె, నారసింహన్నపల్లె గ్రామాల్లో ఓం శక్తి అమ్మవారికి అంబలి పోసి, పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు.

డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న నాగరాజన్

చిత్తూరు కార్పొరేషన్: ఆటోడ్రైవర్లకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్ తెలిపారు. శుక్రవారం చిత్తూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆటోడ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తూ తన వంతు బాధ్యతగా ప్రజా సమస్యల పైన పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికులతో గౌరవంగా మసులుకోవాలన్నారు. భవన నిర్మాణ కార్మికులలా ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు విజయ్‌కుమార్, రమాదేవి, రవి, రఘు, ప్రకాష్, విజయ చందర్, బాబు, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

బండ.. దందా దండి!

చిత్తూరు నగరానికి చెందిన ఓ కుటుంబం ఏటా మూడు నుంచి నాలుగు సిలిండర్ల వరకు వాడేవారు. ఇటీవల వారు గ్యాస్ బుక్ చేయకున్నా రిజిస్టర్ ఫోన్ నంబర్‌కు మెసేజ్ వచ్చింది. కొద్దిసేప టికే ఓటీపీ రావడంతోపాటు గ్యాస్ ధరతో మరో మెసేజ్ అందింది. ఆ వెంటనే సిలిండర్ డెలివరీ అయినట్లు మరో మెసేజ్ వచ్చింది. ఇదేమిటని గ్యాస్ ఏజెన్సీలో ఆరా తీయగా కనుక్కుంటామని సమాధానం ఇచ్చి ఫోన్ పెట్టేశారు. ఇలా ఈ కుటుంబానికి ఏడాదిలో రెండు సార్లు జరగడంతో అయోమయ పరిస్థితి ఎదుర్కొంటున్నారు. వీరొక్కరికే కాదు నియోజకవర్గాల వ్యాప్తంగా ఇలా జరుగుతోందని.. గ్యాస్ ఏజెన్సీల డీలర్లు, సిబ్బంది మాయాజాలమే ఇందుకు కారణమని తెలుస్తోంది.

వాయుబండ దందా దండిగా సాగుతోంది. ఏజెన్సీలు గృహావసరాల సిలిండర్లను వాణిజ్య సంస్థలకు మళ్లిస్తుండగా.. గ్యాస్ డెలివరీ బాయిస్ అడిగినంత ఇవ్వకుంటే వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నారు. అసలు ధర కన్నా కొసరు ఎక్కువగా గుంజేస్తున్నారు. గ్యాస్ దందాపై కథనం.

- పక్కదారి పడుతున్న సబ్సిడీ సిలిండర్లు
- వినియోగదారుల పేరిట బుక్ చేసి ఇతరులకు విక్రయం
- అక్రమార్జనే లక్ష్యంగా డీలర్ల ఎత్తులు
- మరోపక్క డెలివరీ బాయ్స్ అదనపు వసూళ్లు
- వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ అమ్మకం

కాణిపాకం: గ్యాస్ సిలిండర్ల దందా యథేచ్ఛగా సాగుతోంది. డీలర్లు వినియోగదారుల పేరిట సిలిండర్లు బుక్ చేసి ఇతరులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై ఎవరైనా ప్రశ్నిస్తే పొరపాటు జరిగిందని దాటవేస్తున్నారు. వినియోగదారులకు సబ్సిడీ జమ అవుతున్నా.. సిలిండర్లను డీలర్లు ఇతరులకు అధిక ధరకు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు గృహావసరాల సిలిండర్లను హోటళ్లు, వాణిజ్య సంస్థలకు చేరవేస్తున్నారు. మరోపక్క డెలివరీ బాయ్స్ అదనపు వసూళ్లకు పాల్పడుతుండగా పౌరసరఫరాల సంస్థ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

వినియోగదారులకే ఆంక్షలు

వినియోగదారుడికి గ్యాస్ సిలిండర్ కావాలంటే మొదట బుక్ చేసుకోవాలి. ఆ తర్వాత డెలివరీ సమయంలో ఓటీపీ చెప్పాలి. ఇదంతా సామాన్య వినియోగదారులకే వర్తిస్తుండగా.. కొందరు డీలర్లు ఇతరులకు మాత్రం ఎలాంటి ఆంక్షలు లేకుండా అమ్మేస్తున్నారని తెలుస్తోంది. ఏటా రెండు నుంచి మూడు సిలిండర్లు మాత్రమే బుక్ చేసుకునే వారిని లక్ష్యంగా చేసుకుని వారి పేరిట బుక్ చేసి ఇతరులకు బ్లాక్ లోవిక్రయిస్తున్నారు. ఈ సమయం వినియోగదారుడి సెల్ నంబర్‌కు బుక్ చేసినట్లు, డెలివరీ అయినట్లు మెసేజ్‌లతో పాటు ఓటీపీ కూడా వస్తోంది. కానీ ఓటీపీ కోసం ఎవరూ ఫోన్ చేయడం లేదు. దీంతో పనిలేకుండా ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.

ఇష్టారాజ్యం

వాణిజ్య అవసరాల కోసం డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ వినియోగించడానికి వీల్లేదు. కానీ వాణిజ్య సిలిండర్ల ధర ఎక్కువగా ఉండడంతో కొందరు డీలర్లు హోటళ్లకు డొమెస్టిక్ సిలిండర్లు సరఫరా చేస్తున్నారు. తోపుడుబండ్లపై నిర్వహించే టిఫిన్ సెంటర్లు మొదలు హోటళ్లు, రెస్టారెంట్లలో ఈ సిలిండర్లే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ రాయితీతో సిలిండర్‌లు వస్తుండడం.. కొందరు ఏటా రెండు నుంచి మూడు మాత్రమే వాడుతుండడంతో వారి పేరిట సిలిండర్లు బుక్ చేసి వాణిజ్య అసరాలకు మళ్లించి, డీలర్లు సొమ్ము చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.

నిద్రావస్థలో అధికారులు

జిల్లా వ్యాప్తంగా గ్యాస్ సిలిండర్ల దందా యథేచ్ఛగా సాగుతున్నా పౌరసరఫరాల సంస్థ అధికారులు మాత్రం దృష్టి సారించడం లేదు. డీలర్లు లెక్కాపత్రం లేకుండా డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు విక్రయిస్తున్నా తనిఖీల మాటెత్తడం లేదు. గ్యాస్ గోడౌన్లలో కానీ, ఏజెన్సీల్లో కానీ తనిఖీ చేసిన దాఖలాలు లేవనే చెప్పాలి. ఇదే అదునుగా డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అడ్డూ అదుపు లేకుండా దందా కొనసాగిస్తున్నారు.



గ్యాస్ వివరాలు..

ప్రాంతం	:	గ్యాస్ సిలిండర్ల సంఖ్య
చిత్తూరు	:	65,982
గుడిపాల	:	13,911
పూతలపట్టు	:	14,386
ఐరాల	:	16,710
తవణంపల్లి	:	17,080
బంగారుపాళెం	:	22,907
యాదమరి	:	14,383

చర్యలు తీసుకుంటాం

వినియోగదారులకు సంబంధం లేకుండా గ్యాస్ బుక్ చేసినట్లు, డెలివరీ ఇచ్చినట్లు మెసేజ్‌లపై ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటాం. ఇలా చేసే ఏజెన్సీలపై చర్యలు ఉంటాయి. అలాగే, డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడకుండా తనిఖీలు చేస్తున్నాం. ప్రభుత్వ నిబంధనల మేరకు గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులకు సిలిం డర్లు సరఫరా చేయాలి.

–శంకరన్, డీఎస్‌ఓ, చిత్తూరు

డెలివరీ బాయ్స్ దందా..



డీలర్ల వ్యవహారం ఇలా ఉంటే.. సిలిండర్లు డెలివరీ చేసే సిబ్బంది తమ వంతుగా వసూళ్ల పర్వం సాగిస్తున్నారు. ఐదు కిలోమీటర్ల వరకు సిలిండర్ను ఉచితంగా డోర్ డెలివరీ చేయాలి. 30 కి.మీ. అయితే రూ.10, అంతకు మించి దూరమైతే రూ.15 వసూలు చేసుకోవచ్చు. కానీ ఎక్కడైనా సరే సిలిండర్ తీసుకొస్తే చాలు రూ.30 నుంచి రూ.60 వసూలు చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మరుసటి నెల ఆలస్యం చేయడమో లేదంటే డోర్ లాక్ చేసి అని దాటవేయడమో చేస్తున్నారని తెలుస్తోంది.

కాణిపాకంలో రీజినల్ జాయింట్ కమిషనర్

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం తిరుపతి దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం స్వామివారి చిత్ర పటం, ప్రసాదం అందజేశారు. చిత్తూరు నగరంలోని దుర్గాంబను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దుశ్శాలువాలతో సన్మానించి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో కాణిపాకం ఈఓ గురుప్రసాద్, జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ చిట్టెమ్మ, దుర్గాంబ దేవస్థాన ఈఓ మునిశేఖర్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు


పేకాటరాయుళ్లను అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ ధరణీధర

ఐరాల: మండలంలోని బొమ్మసముద్రం వద్ద శుక్రవారం రాత్రి పేకాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు కాణిపాకం ఎస్‌ఐ ధరణీధర తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. బొమ్మసముద్రం గ్రామం సమీపంలో ఓ అరటి తోటలో పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసి, ముగ్గురిని అరెస్టు చేశామని, మరో ముగ్గురు పరారైనట్లు తెలిపారు. వారి నుంచి రెండు ద్విచక్రవాహనాలు, రూ.6,040 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

బ్రహ్మోత్సవ వ్యయంపై శ్వేతపత్రం విడుదల చేయాలి

కాణిపాకం: కాణిపాకం బ్రహ్మోత్సవాల ఖర్చులకు సంబంధించిన శ్వేతపత్రం విడుదల చేయాలని ఏపీసీసీ మాజీ కార్యదర్శి పరదేశి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాణిపాక ఆలయ ట్రస్టు బోర్డ్ చైర్మన్ ఏర్పాటు చేయలేదన్నారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. వీటిని నిరసనగా ఈ నెల 31వ తేదీన నిరసన కార్యక్రమం చేపడుతున్నామని ఆయన తెలిపారు.

నేత్రానందంగా పవళింపు సేవ


దుర్గాంబ ఆలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం గిరింపేటలోని శ్రీదుర్గాంబ దేవస్థానంలో శుక్రవారం నవరాత్రి ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌కు అభిషేకం చేసి పలురకాల పుష్పాలతో అలంకరించారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం 6 గంటల నుంచే భక్తులు అమ్మవారి దర్శనార్థం భారీగా క్యూకట్టారు. ఆలయం చుట్టూ భక్తులు దీపారాధన చేపట్టారు. తర్వాత అలంకార మండపంలో కుంకుమార్చనకు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తిప్రపత్తులతో వ్రతం ఆచరించారు. రాత్రి అమ్మవారు పవళింపు సేవలో భక్తులను కనువిందు చేశారు. క్యూకట్టిన భక్తులు అమ్మవారిని కర్పూర హారతితో తరించి మొక్కులు చెల్లించుకున్నారు. గుర్రప్పనాయుడువీధిలోని శ్రీ అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నవమి పూజలను భక్తిశ్రద్ధలతో చేశారు. ఉదయం నవధాన్యాలతో అలంకరించారు. రాత్రి సరస్వతిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాములవారిగుడివీధిలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో స్వామివారు బలరామావతరం, కట్టమంచిలోని సాయిబాబా ఆలయంలో దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు అభయమిచ్చారు.



మహిషాసురమర్దినిగా ముత్యాలమ్మ


బంగారుపాళెం: మహిషాసురమర్దినిగా ముత్యాలమ్మ,బంగారుపాళెం: వజ్రాలపురంలో.., మొగిలిలో గాజుల అలంకరణ, దుర్గాదేవిగా పాలేటమ్మ, చాముండేశ్వరిదేవి

బంగారుపాళెం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా తొమ్మిదో రోజు శుక్రవారం గ్రామదేవత ముత్యాలమ్మ మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులను కటాక్షించారు. ఉదయం ముత్యాలమ్మ మూలవిగ్రహానికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని మహిషాసురమర్దినిగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. సుమలత, సోము, రామ్మూర్తి, నరసింహులు, గాంధీ, అమరనాథరెడ్డి, సురేంద్రబాబు, భూపతి, మూర్తి, నేతాజీ నాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు. చైర్మన్ కృష్ణమూర్తి, అర్చకుడు మురళీ గురుకుల్ పాల్గొన్నారు.

వజ్రాలపురంలో..

వజ్రాలపురం బోయకొండ గంగమ్మ మహిషాసురమర్దినిగా భక్తులకు అభయమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక హోమం, పూజలు, అభిషేకాలు చేపట్టారు. భక్తులకు దర్శనం కల్పించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. తగ్గువారిపల్లెకు చెందిన కుప్పమ్మ, చంద్రాచారి ఉభయదారులుగా వ్యవహరించారు. ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప, మేనేజర్ మొగిలప్ప, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మొగిలివెంకటగిరిలో..

మొగిలివెంకటగిరి గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు జగదీష్‌స్వామి అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు తరలివచ్చారు.


కామాక్షమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

ఓంశక్తి ఆలయంలో ..


బంగారుపాళెంలోని ఓంశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు విశేషపూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం భక్తులు భజన కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

కామాక్షమ్మకు గాజుల అలంకారం

బంగారుపాళెం: దసరా ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం మండలంలోని మొగిలి శివాలయంలో శ్రీకామాక్షమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కామాక్షమ్మ వారిని గాజులతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద ఎత్తున మహిళలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజులు పాల్గొన్నారు.

దుర్గాదేవిగా పాలేటమ్మ

ఐరాల: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక పాలేటమ్మ అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారి మూలవిరాట్‌ను సుగంధ పరిమళ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక అభిషేకాలు, పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం పాలేటమ్మను దుర్గాదేవిగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించి, భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమార్చన చేశారు. వైఎస్ గేటులోని చాముండేశ్వరి ఆలయంలో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. భక్తులకు పసుపు, కుంకుమ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉభయదారులుగా వైఎస్ గేటు గ్రామస్తులు వ్యవహరించారు.



పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు



ఐరాల: రాష్ట్ర మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్ ఆర్ సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ మోహన్, వైస్ ఎంపీపీ నిత్య ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. సురేష్‌రెడ్డి, మల్లికార్జున, టెరిన్‌రెడ్డి, సురేంద్రయాదవ్, ఓబుల్‌రెడ్డి, లోకనాథ్‌రెడ్డి, రామచంద్రా, రమణ, రవిరెడ్డి, పురుషోత్తం, నవాజ్, సురేష్ పాల్గొన్నారు.